క్లుప్తంగా

2న దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం భవిత కేంద్రం వద్ద ఏప్రిల్ 2న మంగళవారం ఉదయం 9 గంటల నుంచి దివ్యాంగ చిన్నారులకు అవసరమైన ఉపకరణాలు అందజేసేందుకు వీలుగా గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్ర నిర్వాహకులు ఎంవీ బాబు, సీహెచ్ నాగమణి బుధవారం తెలిపారు. అదేరోజు నిపుణులైన వైద్య బృందం దివ్యాంగ చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన వినికిడి యంత్రాలు, మూడు చక్రాల వాహనాలు, చంక కర్రలు, రోలేటర్లు తదితర ఉపకరణాలు ఎంత మందికి అవసరమో గుర్తిస్తారన్నారు. ఆయా ఉపకరణాలు ప్రభుత్వం ద్వారా మంజూరవుతాయని తెలిపారు. ఈ శిబిరానికి రామచంద్రపురం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన దివ్యాంగులు సంబంధిత ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, తల్లి, తండ్రి, దివ్యాంగుల ఆధార్ కార్డులు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు సిద్ధం కావాలని సూచించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్నారు. గొల్లపాలెం ఎస్ఎస్ హెచ్‌క్యూ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, శలపాక, తణుకువాడ, మంజేరు, శీల, శీలలంక, ఒంటితాడి కాజులూరు, అయితపూడి, తిప్పరాజుపాలెం, తాళ్ళరేవు మండలం బొడ్డువానిలంక, కరప మండలం కొంగోడు, గొర్రిపూడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ లైన్లలోని గృహవాసాలతో పాటు ఇండస్ట్రియల్ ఫీడర్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందని ప్రజలు సహకరించాలన్నారు.

వైభవంగా శ్రీనివాసుని విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టి వారిపాలెంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా ప్రతిష్ఠించారు. జక్కంశెట్టి గంగిశెట్టి స్థాపించబడిన ఆలయం నందు బ్రహ్మశ్రీ ఎస్ఎస్‌వీవీఎల్ఎన్ శర్మ (బుజ్జి) పర్యవేక్షణలో స్వామి వారికి రత్నవ్యాసం, గర్తవ్యాసం, నవ ధాన్యాలు, నవరత్నాలు, మహాపూర్ణాహుతి, స్వర్ణయంత్ర ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన చేపట్టారు.

ఘనంగా గణపతి కల్యాణం



గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు

అంబాజీపేట: మాచవరం గ్రామ పంచాయతీ సమీపాన వేంచేసిన సిద్ధి, బుద్ధి సమేత యువగణపతి స్వామి వారి కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడమంచిలి వెంకటకృష్ణ నాగేశ్వరరావుశర్మ పర్యవేక్షణలో స్వామి వారి దివ్య కల్యాణాన్ని జరిపారు. దొమ్మేటి త్రిమూర్తులు, సూర్యకుమారి, చిరంజీవి, కనకదుర్గ వినోద్‌కుమార్ నాగలక్ష్మిల సహకారంతో భారీ అన్నసమారాధన చేశారు.

ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

అంబాజీపేట: మండలంలో మూడు కేంద్రాల్లో బుధవారం జరిగిన పదో తరగతి సోషల్ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు తెలిపారు. అంబాజీపేట నుంచి 143 మందికి 142, తొండవరం నుంచి 159 మందికి 158, పుల్లేటికుర్రు నుంచి 187 మందికి 186 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మూడు కేంద్రాల నుంచి ఒక్కొక్కరి చొప్పున పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవోలు తెలిపారు.

వాహనాల తనిఖీ

సీతానగరం: వంగలపూడి గ్రామం వద్ద వాహనాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. బుధవారం సీతానగరం–పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డులో వంగలపూడి వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కాశీ మధుబాబు, కానిస్టేబుల్ కె.వినోద్ కుమార్ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ రూ.49,999 వరకు నగదు తీసుకొని వెళ్లవచ్చని, రూ.50 వేలు పైబడి నగదు ఉంటే ఆధారాలు చూపాలన్నారు. అలాగే రూ.10 వేలు పైబడి విలువ గల ఆర్టికల్స్ కొనుగోలు చేసినట్టయితే తగిన రసీదులు, ఆధారాలు చూపాలని అన్నారు. ఓటర్లను ప్రలోబపెట్టే ఏవిధమైనా సామగ్రి, నగదును తరలిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. వీడియోగ్రాఫర్ సతీష్ పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వేసవి కాలం.. దోపిడీలకు ఆలవాలం
- కష్టార్జితాన్ని కాపాడుకోవాల్సింది ప్రజలే
- జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు



అముజూరులో జరిగిన దోపిడీలో చిందరవందరగా పారవేసిన సామాన్లు (ఫైల్)

కె.గంగవరం: వేసవి అంటే ఉక్కపోత ఒక్కటే కాదు, దొంగల కాలం కూడా. దొంగతనాలకు ఈ కాలం అనువైనది. గ్రామీణ ప్రాంత ప్రజలు రోజంతా కష్టపడి అర్ధరాత్రి ఎప్పటికో కంటి నిండా నిద్రిస్తారు. ఆ సమయమే దొంగలకు అనువైంది. జనాలు హాయిగా నిద్రపోతుంటే దొంగలు చప్పుడు లేకుండా చక్కగా బీరువాలు తెరిచి సొత్తుతో పారిపోతారు. పాపం పోలీసులు కూడా ప్రతి ఇంటిని గమనించలేరు కదా! అందుకే ప్రజలే పూర్తి స్థాయిలో చైతన్యం కావాల్సి వుంది. ఎంత నిద్రలో మునిగినా తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి. బంగారు ఆభరణాలు, సొమ్ము ఇంట్లో ఉంచుకుని తీరా అవి పోయాక అయ్యో అనకుండా లాకర్లలో భద్రపరిస్తే క్షేమంగా ఉంటాయి.

పెరుగుతున్న దొంగతనాలు

నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం పట్టణం, రూరల్ మండలాల్లో ప్రతి ఏటా వేసవిలో దొంగతాలు అడపాదడపా జరుగుతూనే ఉన్నాయి. ఇవి కాస్త ఇప్పుడు పెరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. కె.గంగవరం మండలంలో ఈ ఏడాది పట్టపగలే మహిళ మెడలో నుంచి బంగారు తాడు లాక్కెళ్లడం నుంచి పట్టపగలే ఇంట్లో సొమ్ము ఎత్తుకుపోయే వరకు పలు దొంగతనాలు జరిగాయి. దొంగతాలకు కరువు ఒక కారణమైతే జల్సాలు, అందివచ్చిన ఆధునిక విలాసాలు, మద్యం కూడా కారణాలే. ఆందోళనకరమైన అంశం ఏంటంటే టీనేజీ పిల్లలు దొంగతానాలకు పాల్పడుతున్నారు.

రెక్కీ నిర్వహించి మరీ చోరీలు

దొంగతనం చేయాల్సిన ప్రదేశాలను రెండు, మూడు సార్లు పరిశీలిస్తారు. అంటే బిచ్చగాళ్ల గానో లేక చెత్తకాగితాలు ఏరుకునే వాళ్లలాగానో వచ్చి ప్రణాళిక వేసుకుని సులువుగా దొంగతనం చేసి తప్పించుకుంటారు. కొందరు బంగారు, వెండి మెరుగుపెడతామని చెప్పి కళ్లముందే కనికట్టు చేసి దోచుకుపోతారు. ఈ మధ్య కాలంలో మహిళల మెడలో నుంచి గొలుసు దొంగతనాలు ఎక్కువయ్యాయి. మహిళలను టార్గెట్ చేసి వారిని వెంబడించి అదను చూసి వెంటనే బైక్‌పై వచ్చి మెడలో గొలుసు లాక్కెళుతున్నారు. మహిళలు వీలైనంతవరకు ఒంటరిగా వెళ్లకుండా పక్కన ఇద్దరు. ముగ్గురు ఉండేలా చూసుకోవాలి.

రైతులనూ కనికరించని చోరులు

వ్యవసాయ వస్తువులు, ధాన్యం కూడా అపహరణకు గురవుతున్నాయి. గత ఏడాది రబీలో అముజూరులో ఆరుగాలం పండించిన పంట రోడ్డు పక్కన రైతు ఆరబెట్టుకుంటే అర్ధరాత్రి సమయంలో ధ్యానం మొత్తం ఎత్తుకుపోయారు. దీంతో పాటు విద్యుత్ మోటార్లు, వ్యవసాయ పనిముట్లు కూడా దొంగలించుకుపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

జాగ్రత్తే ముందు..

వేసవి కాలం కావడం వల్ల ఉక్కపోతతో మేడపైన పడుకోవడం, లేక ఇంటి బయట ఆవరణలో పడుకోవడం ప్రస్తుతం సహజం. అయితే ఇలాంటి సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి దొంగతనాలు జరిగే అవకాశం ఉండదు. కనీసం కొన్ని జాగ్రత్తలైనా తీసుకుంటే కష్టపడి సంపాదించిన సొమ్ము కాపాడుకోవచ్చని అంటున్నారు పోలీసులు. పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు తిరుగుతుంటే గమనించాలి. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ఆరుబయట పడుకుని ఇంటికి తాళాలు వేసి తాళులు దిండుకింద కాకుండా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే పోలీసులకు తప్పకుండా సమాచారం అందించాలి..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం వేసవి కావడం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బయట ఊర్లకు వెళితే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. రాత్రి సమయంలో గస్తీ కూడా తిరుగుతున్నాం. ఎటువంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలి.

– జానీ భాషా, ఎస్సై, కె.గంగవరం

3న మండల సమావేశం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం ఏప్రిల్ 3న బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్‌వీ రామచంద్రమూర్తి బుధవారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి సమీక్షలు, తీర్మానాలు లేకుండా ఉండే విధంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక అనుమతితో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

బ్యాంకు శాఖ ప్రారంభం

కాజులూరు: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ చైర్మన్ టి కామేశ్వర్రావు అన్నారు. బుధవారం గొల్లపాలెంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ 259వ బ్రాంచ్‌ను బ్యాంక్ చైర్మన్ టి కామేశ్వర్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వి.సాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఉభయగోదావరి, గుంటూరు జిల్లాల్లో తమ బ్యాంకుకు 26 లక్షల మంది ఖాతాదారులు ఉన్నారన్నారు. ఖాతాదారుల సౌలభ్యమే లక్ష్యంగా తమ బ్యాంక్ పని చేస్తుందని డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ యూనియన్ బ్యాంక్ సిబ్బంది ఎం రామకృష్ణయ్య, పలువురు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం జగనన్నకే సాధ్యం



రామచంద్రపురం 27వ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న పిల్లి సూర్యప్రకాశ్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్
- రామచంద్రపురం 27వ వార్డులో పర్యటన

రామచంద్రపురం: ప్రజా సంక్షేమ పాలన వైఎస్ జగనన్నకే సాధ్యమని రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 26వ వార్డు రామదుర్గా థియేటర్ వీధి గుబ్బల సత్తమ్మవారి ఆలయం వద్ద నుంచి సూర్యప్రకాశ్ తదితరులు ఇంటింటికీ పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పేద మహిళలు, వృద్ధులను సూర్యప్రకాశ్ ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ముఖ్యమంత్రి జగనన్న గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ నూరుశాతం అమలు చేశారని అన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మ్యానిఫెస్టోలో లేని ఎన్నో పథకాలు అమలు చేశారని తెలిపారు. దేశంలో భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సగటున ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. పార్టీ విజయాలకు కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చెయ్యాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వర్రావు, కౌన్సిలర్లు మేడిశెట్టి కృష్ణవేణి, బాసిని నాగమణి, కోటిపల్లి లక్ష్మీశివాజీ, కో ఆప్షన్ మెంబర్లు గుబ్బల గణ, మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, పార్టీ పట్టణ కన్వీనర్ గాదం శ్రీధర్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు.. వైఎస్సార్ సీపీ ధ్యేయం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేదారిలంకలో పర్యటన

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజలతోపాటు అన్ని వర్గాల మేలు కోరి పాలన సాగించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆ విషయాన్ని ఐదేళ్ల పాలనా తీరును చూసి నిర్ధారించుకోవచ్చన్నా రు. మండలంలోని కేదారిలంక, శివారు గ్రామాల్లో బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఆయనకు గ్రామస్తులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. గ్రామ ప్రముఖులు ఆయన అడుగులో అడుగు వేస్తూ ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ చల్లా ప్రభాకర్‌రావు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, కపిలేశ్వరపురం, కొత్తపేట మండలాల కన్వీనర్లు శీలం గోవిందు, ముత్యాల వీరభద్రరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, యువనేత తోట పృథ్వీరాజ్, నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్‌లతో కలిసి పర్యటించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ లంక గ్రామాల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తిగా అన్ని వేళలా ప్రభుత్వం తరపున ఆదుకున్న విషయాన్ని గుర్తించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలకు పెద్ద ఎత్తున సంక్షేమం అందిందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు సమకూరాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీధి గంగాధర్, యర్రంశెట్టి నాగేంద్ర, కాశి శ్రీను, వీధి శ్రీను, వీధి రాజు, కొండేటి జానకి, కోనాల బుజ్జి పాల్గొన్నారు.



కేదారిలంక గ్రామస్తుల సమస్యలను వింటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: కేదారిలంకలో ఇటీవల మరణించిన యర్రంశెట్టి సుబ్బరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, నాయకులు ఉన్నారు.

శనైశ్చరుని హుండీల ఆదాయం రూ.2.97 లక్షలు

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి ఆలయంలో హుండీల ద్వారా రూ.2,97,668 ఆదాయం వచ్చినట్టు దేవదాయ–ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి తెలిపారు. మూడు నెలల అనంతరం ఆలయ హుండీలను బుధవారం ఏసీ అండ్ ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వెలిచేరు ఆలయ ఈఓ ఆకుల సత్యవర్ధన్ సమక్షంలో తెరచి లెక్కించారు. శనైశ్చరుని హుండీ ద్వారా రూ.2,80,257, అన్నదానం హుండీ ద్వారా రూ.17,411తో పాటు క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి వారి హుండీ ద్వారా రూ.15,661 ఆదాయం వచ్చిందని విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ ఉత్తమకుమారి, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



మందపల్లి శనైశ్చరాలయంలో హుండీల నగదు లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

సర్వర్ పనిచేయక ఇక్కట్లు

బిక్కవోలు: బిక్కవోలు యూనియన్ బ్యాంకు వద్ద సర్వర్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి సర్వర్ మొరాయించడంతో ప్రధానంగా పలు గ్రామాల నుంచి వచ్చిన డ్వాక్రా గ్రూపుల సభ్యులు గంటల తరబడి ఎదురుచూసి వెనుదిరిగారు. మధ్యాహ్నం తరువాత సర్వర్‌ను పునరుద్ధరించడంతో ఖాతాదారులకు ఉపశమనం లభించింది.

సుప్రీం తీర్పును పరిగణలోకి తీసుకోవాలి

మండపేట: 1980–1984 మధ్యకాలంలో రిజర్వు ట్రెయిన్డ్ పూల్ స్కీం ద్వారా పోస్టల్ శాఖలో పోస్టల్ అసిస్టెంట్లుగా చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్న సుప్రీంకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకోవాలని రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. నాయకులు వి.రవికృష్ణ, వి.కృష్ణమోహనరావు, సలాది సత్యనారాయణమూర్తి, వి.రామకృష్ణ, టి.పుల్లేశ్వరరావు, ఎస్ఎస్ ప్రకాశరావు బుధవారం మాట్లాడుతూ సంబంధిత ఉద్యోగులను క్రమబద్ధీకరించాల పోస్టల్ శాఖ ఉన్నతాధికారులను కోరారు.

కేశవరంలో బూత్ కమిటీ సభ్యుల పర్యటన

మండపేట: మండలంలోని కేశవరం 6వ బూత్ పరిధిలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా బుధవారం బూత్ కమిటీ సభ్యులు పర్యటించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి అద్దంకి రమణ, మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్, మండల జేసీఎస్ ఇన్‌చార్జి బందెల సాయిరామ్, బూత్ కన్వీనర్ మనువర్తి ఏసురాజు, సమతం పెద్ద పాపారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



పదో తరగతి పరీక్షలు రాసిన అనంతరం ఉత్సాహంగా ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

రాయవరం: పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. రాయవరంలోని శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏ,బీ సెంటర్లు, చెల్లూరు, పసలపూడి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రాల్లో సోషల్ పరీక్షకు తెలుగు మీడియం 511 మంది, ఇంగ్లీషు మీడియం 189 మంది విద్యార్థులను కేటాయించగా తెలుగు మీడియం ఐదుగురు, ఇంగ్లీషు మీడియం నుంచి 21మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షల సమయంలో అధికారులు వచ్చి తనిఖీలు నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలు సోషల్ పరీక్షతో ముగియడంతో విద్యార్థులంతా పరీక్షా కేంద్రాల నుంచి సంతోషంగా బయటకు వెళ్లారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ పదిరోజుల్లో స్నేహితులుగా మారగా ఒకరికొకరు వీడ్కోలు చెబుతూ వెళ్లడం కన్పించింది.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

కె.గంగవరం: పదోవ తరగతి పరీక్షలు మండల పరిధిలోని పామర్ర, కె.గంగవరం, కోటిపల్లి, దంగేరు ఉన్నత పాఠశాల్లోని సెంటర్లలో మొత్తం 319 మంది బుధవారం విద్యార్థులు సోషల్ పరీక్ష రాశారు. పదో తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

సహజ సిద్ధం.. ఆరోగ్యకరం

- పండ్లను మగ్గించేందుకు కృత్రిమ పద్ధతులు అనర్థం
- ఇష్టానుసారంగా రసాయనాల వినియోగం
- మామిడి పండ్ల సీజన్ ప్రారంభం
- రైపెనింగ్ చాంబర్ల ఏర్పాటు పరిష్కారం



కపిలేశ్వరపురం: ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యత సహజంగా ఉండనే ఉంటుంది. ప్రజల్లో పెరిగిన ఆరోగ్య అవగాహన నేపథ్యంలో రోజువారీ ఆహారంలో జామ, బొప్పాయి, దానిమ్మ, కమలా, ఆపిల్ తదితర పండ్లను తీసుకుంటున్నారు. వైద్యులు, న్యూట్రీషియన్లు సైతం పండ్లు, గింజలను తినమంటూ అవగాహన సైతం కల్పిస్తున్నారు. తినే పండ్లలో ఆరోగ్య శాతం ఎంత అన్న ప్రశ్న వినియోగదారులను వేధిస్తోంది. మార్కెట్‌లోకి మామిడి పండ్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్, ఇథిలిన్ ద్రావణంను వినియోగిస్తుండటంతో ఫలాలు విషతుల్యమై ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతోంది.

రెండు నియోజకవర్గాల్లో పండ్ల ఉత్పత్తి ఇలా...

ఏటా దివాన్ చెరువు, రావులపాలెం నుంచి తెచ్చిన పండ్లను రామచంద్రపురం, మండపేటతో పాటు ఆయా నియోజకవర్గాల గ్రామాల్లో విక్రయాలు సాగిస్తుంటారు. స్థానిక వ్యవసాయ క్షేత్రాలతో పాటు ఇతర ప్రాంతాల పండ్లను ఆయా మార్కెట్లలో విక్రయిస్తున్నారు. మండపేట నియోజకవర్గంలో 60, ఇతర కోనసీమ ప్రాంతంలో 90 మొత్తం 150 ఎకరాల్లో మామిడి ఉత్పత్తి అవుతుంది. అరటి ఉత్పత్తి కొత్తపేట మండలంలో 2,890 ఎకరాలు, రావులపాలెంలో 3,242, ఆత్రేయపురం 3,948, కపిలేశ్వరపురం 667, మండపేట 71, ఆలమూరు 1,100 మొత్తం 11,918 ఎకరాల్లో అరటి ఉత్పత్తి అవుతుంది. నున్న, రాజోలు ప్రాంతాల నుంచి మామిడి, ఏలేశ్వరం నుంచి అరటి దిగుమతి అవుతుంది.

సహజసిద్ధంగా పండిన పండ్లను గుర్తించండి ఇలా...

సహజసిద్ధంగా మాగిన మామిడి పండ్లు రంగు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వత చెంది ఉంటుంది. కమ్మని వాసనను మనం దూరంగా ఉన్నప్పటికీ గ్రహించగలుగుతాం. సహజ సిద్ధమై తీపి ఎక్కువగా ఉంటుంది. రసాయనాలతో మాగబెట్టిన పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటుంది. పైకి మాగినట్టు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటుంది. కమ్మని వాసన ముక్కు దగ్గర ఉంచినప్పుడు మాత్రమే వస్తుంది. తక్కువ తీపి ఉంటుంది.

అధికమైన రసాయనాల వినియోగం

ఉత్పత్తి అయిన వ్యవసాయ క్షేత్రం నుంచి వినియోగదారుడికి పండ్లు చేరే మధ్యలో ఉండే మార్కెట్ కీలకమైనది. పండు చెట్టుమీదనే పరిపక్వతకు వచ్చాక తినడమనేది దాదాపు సాధ్యం కాదు. పచ్చిగా ఉండగానే వాటిని ప్రకృతి సిద్ధంగా మాగబెట్టి మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంది. సమయానుకూలత వల్ల దళారులు రసాయనాల వినియోగం ద్వారా పండ్లను మాగబెడుతున్నారు. మామాడి పండ్లను మగ్గించేందుకు కాల్షియం కార్బైడ్ వినియోగిస్తున్నారు, అరటికి రంగు వచ్చేలా ఇథిలిన్ ద్రావణం స్ప్రే చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మార్కెట్‌కు, రైతుకు మధ్య ఉన్న దళారీలే చేస్తున్నారు.

విజిలెన్స్ శాఖ దాడులు చేయాలి

పండ్లను రసాయనాలతో మాగబెట్టి అమ్మడంపై విజిలెన్స్ శాఖ దాడులు నిర్వహించి కేసులను నమోదు చేస్తుంది. రసాయనాలు వినియోగించారా లేదా అనేది ఉద్యానశాఖాధికారులు నిర్ధారించగా సంబంధిత అధికారులు చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటారు. పండ్లు విషతుల్యం కాకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన రైపెనింగ్ చాంబర్లలో పండ్లను మాగబెట్టి విక్రయించడం మేలు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు
- ఆలయానికి రూ 1.50 లక్షల విరాళం

ఆలమూరు: మండలంలోని మడికిలో నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్టు నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలతో స్థానిక తూర్పు వీధి గొయ్యి ప్రాంతంలో నిర్మించిన ఈ ఆలయంలోని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రముఖ వేద పండితుడు బ్రహ్మశ్రీ కాళ్లకూరి కామేశ్వరశర్మ మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని గత మూడు రోజుల నుంచి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న హోమాలు ముగిశాయి. అలాగే అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం మహిళలు గోదావరి జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరిగింది.



మడికిలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.1.5 లక్షల విరాళం

గ్రామంలో నూతనంగా నిర్మించిన నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.1.5 లక్షలను విరాళంగా అందజేశారు. ఇప్పటికే శ్రీవాణి ట్రస్టు నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మళ్లీ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తుండటం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మి మౌనిక, పడమట రాంబాబు, ఉండ్రాజపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో మేట్లకు శిక్షణ

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని మేట్లకు వివిధ అంశాలపై అధికారులు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. మస్టరు నిర్వహణ, ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు, కొలతలు, 100 రోజుల పనిదినాలు కల్పించడం వాటిపై పి.గన్నవరం క్లస్టర్ ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు, జాబ్ కార్డ్స్–బెనిఫిట్స్ ఏపీడీ జి.కవిత అవగాహన కల్పించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో ఎండీ నాగప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ త్రినాథ్, జేఈ శ్రీను పాల్గొన్నారు.